ప్రజాశక్తి
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024
5
అనంతపురం

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నేడు కార్మికుల సమ్మె.. గ్రామీణ బంద్..!

◆ కదం తొక్కనున్న రైతులు, కార్మికులు ◆ జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు ◆ మద్దతు ప్రకటించిన వామపక్షాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కార్మికులు, కర్షకులు తమ సమస్యలపై నేడు దేశవ్యాప్తంగా కదం తొక్కనున్నారు. కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సిద్ధమయ్యారు. కార్మిక సంఘాలు దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చి ఉండగా, రైతు సంఘాలు గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ బంద్ దేశ వ్యాప్తంగానున్న అన్ని కార్మిక సంఘాలతోపాటు, రైతు సంఘాలు చేపట్టనున్నాయి. ఇప్పటికే రైతులు ఢిల్లీలో పెద్దఎత్తున పోరాటానికి దిగిన విషయం తెలిసిందే. మూడు నల్లచట్టాలను రద్దు చేయనున్నట్టు గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే కనీస మద్దతు ధరకు గ్యారెంటీ ఇవ్వడంలోగానీ, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయడంపై ఏ మాత్రం చర్యలు తీసుకునే పరిస్థితుల్లేక పోవడంతో రైతులు మరో పోరాటానికి సిద్ధమయ్యారు. రాష్ట్రంలోనూ రైతు సంఘాలు దేశ వ్యాప్త సమస్యలతోపాటు ఇక్కడి సమస్యలను జోడించి బంద్‌కు పిలుపునిచ్చారు. ఇందులో గతేడాది పంటనష్టానికి సంబంధించిన పంటనష్ట పరిహారమివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, 2013 భూసేకరణ చట్టం అమలుచేయాలని ఇలా అనేక డిమాండ్లను రైతులు ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక కార్మికులు కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తుండగా, రాష్ట్రంలో కనీస వేతనం రూ26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ తదితర అంశాలపై నేడు రైతులు, కార్మికులు సమ్మె, గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమాలకు వామపక్షాలు మద్దతు తెలిపాయి.

సమ్మెను విజయవంతం చేయాలని అనంతపురంలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

సమ్మెకు మద్దతుగా ప్రచారం

రైతులు, కార్మికులు, ప్రజలు, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటయు నగర 1వ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్టీఆర్ శ్రీనివాసులు, వై.వెంకటనారాయణ ఆధ్వర్యంలో భగత్ సింగ్ ఆటో డ్రైవర్‌లు నగరంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. తపోవనం సర్కిల్ నుంచి మైక్ ప్రచారం నిర్వహించారు. 4వ రోడ్, నీలిమా సర్కిల్, ఇండియన్ బ్యాంక్ సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, నీలం టాకీస్, పాతూరు తాడిపత్రి బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిట్ అండ్ రన్ చట్టాన్ని ఉపసంహరించాలని నేడు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో ఆటో డ్రైవర్‌లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, రైతు ఆందోళనకు సిపిఎం మద్దతు

జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రైతాంగ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం నాడు చేపట్టిన కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌కు సిపిఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ బుధవారం నాడు ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసగిస్తోందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ లాంటి సహజ సంపదలు, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసి తదితర ఆర్థిక సంస్థలన్నీటిని ఆదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడానికి మోడీ పరిపాలనా కాలమంతా ప్రయత్నించింద న్నారు. కార్పొరేట్ కంపెనీల లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్లు తెచ్చిందన్నారు. రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసిన మరొక రూపంలో వాటిని అమలుపరుస్తోందని తెలిపారు. దీనిపై నిరసన తెలపడానికి ఢిల్లీకి వెళ్తున్న రైతులపై గత మూడు రోజులుగా కేంద్ర ప్రభుత్వం క్రూర నిర్బంధాన్ని విధిస్తోందన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లు పేరుతో వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించి రైతులను మరింత సంక్షోభంలోకి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువులన్నిటి పైన జీఎస్టీ పేరుతో పన్నులు పెంచిందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా మన రాష్ట్రానికి కేంద్రం మరింత ద్రోహం చేసిందన్నారు. కష్ణా జలాలు పంపిణీలో రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రాల హక్కులను హరించి, మతతత్వాన్ని ప్రోత్సహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రైతు కార్మిక ప్రజాసంఘాలు శుక్రవారం తలపెట్టిన ఆందోళనలో సిపిఎం శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కేంద్రాన్ని ప్రశ్నించేలా బంద్..

చంద్రశేఖర్‌రెడ్డి ఎపి రైతు సంఘం

దేశ వ్యాప్తంగా రైతాంగ సమస్యలపై కేంద్రాన్ని ప్రశ్నించేలా రైతు సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన దేశ వ్యాప్త గ్రామీణ బంద్‌కు మద్దతునిచ్చి విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలో గతేడాది పంటనష్టపోయిన రైతులకు పరిహారం ప్రకటించి అందజేయాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధరకు గ్యారెంటీ ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై సాగుతున్న గ్రామీణ బంద్‌కు ప్రజలందరూ మద్దతునివ్వాలని పిలుపునిచ్చారు.

సమ్మెను జయప్రదం చేయండి

నాగేంద్రకుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి

కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సాగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోనూ అన్ని కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్షకులు చేపట్టిన ఈ సమ్మెకు అన్నివర్గాల ప్రజలు మద్దతునివ్వాలని పిలుపునిచ్చారు. అదే విధంగా రైతాంగ సమస్యలపై జరుగుతున్న గ్రామీణ బంద్‌కు మద్దతునిస్తున్నట్టు చెప్పారు.

జీవోలు రాకుంటే సమ్మెలోకి వెళ్తాం

ప్రభుత్వాన్ని హెచ్చరించిన మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలపై పది రోజుల్లోపు జీవోలు విడుదల చేయకుంటే మళ్లీ సమ్మెలోకి వెళ్తామని మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమ్మె హామీల అమలు కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో జిల్లాలోని పలు మున్సిపాల్టీల వద్ద గురువారం నాడు ఆందోళన చేపట్టారు. అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. అనంతపురం కార్పొరేషన్ వద్ద మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు మాట్లాడుతూ సమ్మె సమయంలో అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.21వేల కనీస వేతనం, డ్రైవర్లకు రూ.24,500 వేతనం, ఇంజినీర్ సెక్షన్ కార్మికులకు స్కిల్ టు సెమీ స్కిల్ వేతనాలు, రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న సరెండర్ లీవు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. హామీలు ఇచ్చి 36 రోజులు కావస్తున్నా దీనిపై ఇంత వరకు జీవోలను విడుదల చేయలేదన్నారు. తక్షణమే జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పది రోజుల్లోపు జీవోలు అమలు కాకపోతే సమ్మెల్లోకి వెళ్తామని ప్రభుత్వానికి తెలియజేశారు. ఇక అనంతపురం కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మున్సిపల్ కార్పొరేషన్‌లో స్కిల్డ్ జాబితా తయారీలో సాంకేతిక సర్టిఫికెట్లు కలిగి ఉన్న వారి పేర్లను చేర్చకుండా వారి పేర్లను అన్ స్కిల్డ్ జాబితాలో చేర్చారని, ఈ తప్పులను సరిదిద్ది జాబితా సరిగా తయారు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాబితాను తప్పుగా తయారు చేసిన ఇంజినీరింగ్ సెక్షన్ సీనియర్ గుమస్తాపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కమిషనర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, రాయుడు, కోశాధికారి పోతలయ్య, రెగ్యులర్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు, ఎల్.ముత్తరాజు, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారి ఎర్రిస్వామి, సాకే తిరుమలేశు, శశింద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఓటి అప్లికేషన్‌పై అవగాహన పెంచుకోవాలి

జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి జివిఆర్.శ్రీనివాసరావు

ఐఓటి అప్లికేషన్ వాడకం పెరుగుతున్న నేపథ్యంలో మరింత అవగాహన పెంచుకోవాలని జెఎన్‌టియు ఉపకులపతి జి.వి.ఆర్.శ్రీనివాసరావు సూచించారు. గురువారం స్థానిక జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ఇసిఇ విభాగంలో ప్రిన్సిపల్ ఎస్.వి.సత్యనారాయణ అధ్యక్షతన ఐ హైదరాబాద్ ఐఓటి హెకథాన్ మేక్ స్కిల్డ్ ఇనోవేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఓటి అప్లికేషన్స్ ప్రతిఒక్కరూ రోజూ ప్రతిచోటా వాడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా అగ్రికల్చర్, మెడికల్ మొదలైన వాటిలో ఐఓటి వాడుకకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నేటితతం యువత మేధస్సును ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుందన్నారు. మూడవ రోజుల పాటు విద్యార్థులు ప్రాజెక్టులు తయారు చేసి వివరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి.విష్ణువర్ధన్, హెచ్‌ఒడి డాక్టర్ జి.మమత, రమణారెడ్డి, లలితకుమారి, అరుణ, మస్తానీ, మాజీ ఆచార్యులు ఎంఎన్.గిరిప్రసాద్, మేక్ స్కిల్డ్ నుంచి గిరిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

సిపిఎం హర్షం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని సిపిఎం జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో దొంగడబ్బు, నల్లధనం విచ్చలవిడిగా ప్రవహిస్తోందన్నారు. అధికార పార్టీలకు, పెట్టుబడిదారులు వారి ప్రయోజనాలు ప్రోత్సాహించే అభ్యర్థుల కోసం ఈ డబ్బును వెదజల్లి ఓట్లు కొనుగోలు చేసి ప్రజా తీర్పును తలకిందులు చేస్తున్నారని చెప్పారు. ఇదే నల్లడబ్బుతో ఓడిపోయిన పార్టీ ప్రతినిధులను కొనుగోలు చేసి ప్రభుత్వాలను సైతం తారుమారు చేస్తున్నారన్నారు. ఇటువంటి నేపథ్యంలో ఈ సుప్రీంకోర్టు తీర్పు ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. ఎన్నికల బాండ్లకు వ్యతిరేకంగా కోర్టులో సిపిఎం కూడా పిటిషన్ దాఖలు చేసిందన్నారు. ఎన్నికల ప్రక్రియలో, ఎన్నికల ఖర్చులో పారదర్శకత ఉండాలని కోరుకున్న వారిలో సిపిఎం ముందు వరుసలో ఉందన్నారు. తీర్పు నేపథ్యంలో ఎన్నికల బాండ్లను పూర్తిగా నిషేధించాలన్నారు. ఏ కంపెనీ అయినా, ఏ వ్యక్తైనా ఎవరికి ఎంత డబ్బు ఇస్తున్నాడో, ఆ పార్టీ ఎంత ఖర్చు పెడుతుందో లెక్క ఉంటేనే నల్లధనం ప్రవాహాన్ని అడ్డుకోగలమని చెప్పారు. అధికార పార్టీ ప్రత్యేకించి మోడీ ప్రభుత్వం ప్రత్యర్థి పార్టీలపైకి ఇడి, ఐటి వంటి సంస్థలను ప్రయోగించి వారి దగ్గరున్న డబ్బును లాక్కోవడం, తమ పార్టీ అభ్యర్థులు పెట్టే ఖర్చులపై ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా వదిలేయడం జరుగుతుందన్నారు. అన్ని పార్టీలకు ఎన్నికల్లో ఖర్చు పెట్టేదానికి ఒకే విధమైన విధివిధానాలు ఉంటే ఎన్నికల సంస్కరణల్లో ఒక ముఖ్యభాగం పూర్తవుతుందని తెలిపారు. ఆ దిశగా సుప్రీంకోర్టు కూడా చొరవ తీసుకుని నియమ నిబంధనలు రూపొందించాలన్నారు. ఎన్నికల్లో దొంగడబ్బును అరికట్టగలిగితే ఎన్నికల వ్యవస్థను క్రమపద్ధతిలోకి తీసుకురావచ్చనే ఈ తీర్పును సిపిఎం స్వాగతిస్తోందని తెలిపారు.

కేంద్రీయ విద్యాలయం ప్రవేశ పరీక్షలకు శిక్షణ

అనంతపురం కలెక్టరేట్ : కేంద్రీయ విశ్వ విద్యాలయంలో ప్రవేశ పరీక్షలకు విద్యార్థులకు ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇండియా ఫర్ ఇండియా ఫౌండేషన్ సలహాదారులు డాక్టర్ అప్పికట్ల భరత్ భూషణ్, భజన్ సతీష్ కుమార్, హేనా నళిని తెలిపారు. గురువారం కురుగుంట అంబేద్కర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు సెంట్రల్ యూనివర్శిటీలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు శిక్షణ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియా ఫర్ ఇండియా ఫౌండేషన్ కోఆర్డినేటర్‌లు శివకుమార్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి చేయూతనిచ్చాం

◆ వైసిపి పాలనలో అందరికీ కష్టాలే
◆ నారా భువనేశ్వరి
◆ శ్రీసత్యసాయి జిల్లాలో ముగిసిన పర్యటన

ప్రజాశక్తి-హిందూపురం మడకశిర, గుడిబండ

హిందూపురంలో అంజినప్ప కుటుంబానికి ఆర్థికసాయం చెక్కును అందిస్తున్న భువనేశ్వరి

టిడిపి ప్రభుత్వ హయాంలో మహిళాభివృద్ధికి ఆర్థిక చేయూతనిచ్చి వారి అభివృద్ధికి బాటలు వేశామని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నిజం గెలవాలి పేరుతో నారా భువనేశ్వరి చేపట్టిన రాష్ట్ర వ్యాప్తయాత్ర శ్రీసత్యసాయి జిల్లాలో గురువారం 3వ రోజు కొనసాగింది. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో యాత్ర కొనసాగింది. చంద్రబాబు నాయుడు అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన హిందూపురం పట్టణం 8వ వార్డు టిడిపి కార్యకర్త యు.అంజినప్ప, మడకశిర నియోజకవర్గం, గుడిబండ మండలం, దిన్నెహట్టి గ్రామంలో పార్టీ కార్యకర్త ముత్తప్ప కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. మడకశిర మండలం అగ్రంపల్లి, కల్లుమర్రి, కదిరేపల్లి తదితర గ్రామాల్లో టిడిపి నాయకులను కలిసి మాట్లాడారు. మడకశిరలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి అక్కడ మహిళలతో ముఖిముఖి నిర్వహించి మాట్లాడారు. మడకశిరలో నిర్వహించిన మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అన్ని మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళల ఆర్థికాభివృద్ధికి మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు తెలియజేశారు. వైసిపి అక్రమ పద్ధతుల్లో గెలిచేందుకు ఓటరు జాబితాలో టిడిపి మద్దతుదారుల ఓట్లను తొలగించే కుట్రలకు పాల్పడుతోందన్నారు. దీనిపై అప్రమత్తంగా ఉండి ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో వారి పేర్లు చూసుకోవాలన్నారు. వ్యక్తిగత అజెండాతో పరిపాలన సాగిస్తున్న వైసిపిని రాబోయే రోజుల్లో ఇంటికి పంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కోరారు. నారా భువనేశ్వరి దిన్నేటి గ్రామానికి వెళ్లిన సమయంలో పలువురు వైసిపి మద్దతుదారులు ఆపార్టీని వీడి టిడిలో చేరారు. భువనేశ్వరి, గుండుమల తిప్పేస్వాములు వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హిందూపురం అభివృద్ధికి నాడు నాన్న నందమూరి తారక రామారావు నేడు తమ్ముడు నందమూరి బాలకృష్ణ కృషి చేస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులోనూ ఇది కొనసాగుతుందని స్పష్టం చేశారు. హిందూపురం నియోజకవర్గంలో నారా భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర సందర్భంగా శింగనమల గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త హేమంత్ యాదవ్, శోభాయాదవ్ దంపతులకు మగ పిల్లాడికి కుశాల్‌కష్ణ అంటూ భువనేశ్వరి నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ మంత్రి పరిటాల సునీత, ఎమ్మెల్సీ అనురాధ, మడకశిర నియోజకవర్గం అబ్జర్వర్ పార్థసారథి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకష్ణతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిరలో భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న గుండుమల తిప్పేస్వామి

పుట్టపర్తిలో వీడ్కోలు

భువనేశ్వరికి పుట్టపర్తి విమానాశ్రయంలో వీడ్కోలు పలుకుతున్న టిడిపి నాయకులు

శ్రీ సత్యసాయి జిల్లాలో మూడు రోజులు పర్యటన ముగించుకుని నారా భువనేశ్వరి పుట్టపర్తి విమానాశ్రయం నుంచి గన్నవరానికి గురువారం సాయంత్రం వెళ్లారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆమె పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో పర్యటించారు. గన్నవరం వెళ్తున్న ఆమెకు సత్యసాయి విమానాశ్రయంలో టిడిపి నేతలు ఘనంగా వీడ్కోలు పలికారు. మాజీ మంత్రులు పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల సునీత, బికె.పార్థసారథి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, బండారు శ్రావణి, సామకోటి ఆదినారాయణ, జయప్రకాష్, శభ చంద్ర, బొమ్మయ్య, శ్రీరామ్ నాయక్ తదితరులు ఆమెకు వీడ్కోలు పలికారు.

రాయదుర్గం వైసిపి అభ్యర్థి నేనే : మెట్టు

ప్రజాశక్తి-డి.హీరేహాల్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాయదుర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నేనేనని నియోజకవర్గ సమన్వ యకర్త మెట్టు గోవిందరెడ్డి స్పష్టం చేశారు. 'ఆసరా' కార్యక్రమంలో మెట్టు మాట్లాడుతూ కొందరు సోషల్ మీడియాలో ఇష్టానుసారం పోస్టులు పెడుతూ తప్పుడు వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయదుర్గం అభ్యర్థిగా 'మెట్టు'ను తప్పించి మంత్రి గుమ్మ నూరు జయరామ్‌కు టికెట్ ఇచ్చే పరిస్థితులు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంపై మండిపడ్డారు. మాట తప్పని మడమ తిప్పని జననేత జగన్ ఓ సారి నిర్ణయం తీసు కున్నారంటే అందుకు తిరుగుండదన్నారు. ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందిన జగన్‌ను మళ్లీ సిఎం చేసేంత వరకూ విశ్రమించబోమన్నారు. వదంతులు నమ్మవద్దని మెట్టు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జగన్ మాట తప్పాడు.. : ఎమ్మెల్యే కాపు

ప్రజాశక్తి-డి.హీరేహాల్

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

సిఎం జగన్ మాట తప్పడు, మడమ తిప్పడు అంటుంటారు కానీ నా విషయంలో మాట, మడ మ రెండూ తప్పాడు అని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారను. డి.హీరేహాల్‌లో గురువారం కాపు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కళ్యాణదుర్గం నుంచి పోటీ చేసేందుకు సిఎం జగన్ తనకు హామీ ఇచ్చి మాట తప్పాడన్నారు. ఆ స్థానంలో వేరొకరిని నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమించి తనను మోసం చేశారని, ఈ విషయంపై జగన్ ఆలోచించుకోవాలని సూచించారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ప్రభుత్వానికి సంబంధించిన కార్యక్రమం అని, అయితే ప్రొటోకాల్ పాటించకుండా నిర్వహించడంపై కాపు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెత్తందారులకు కొమ్ముకాస్తున్న పోలీసు వ్యవస్థ

కార్మికులను విస్మరించిన ప్రభుత్వం-సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్రంలోని పెత్తందారులు, కాంట్రాక్టర్లకు పోలీసు వ్యవస్థ కొమ్ము కాస్తోందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీరామిరెడ్డి కార్మికులు చేస్తున్న ఆందోళన గురువారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా స్థానిక తాగునీటి పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు వేతనాలు చెల్లించాలని శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వైసిపి నాయకులు అడ్డుకోవడం రాజ్యాంగ హక్కులను కాలరాయడమే అన్నారు. మూడు రోజుల క్రితం స్థానిక వైసిపి నాయకులు కార్మికులతో తీవ్ర వాగ్విదానికి దిగడం బాధాకరమన్నారు. వేతనాలు చెల్లించాలని గతనెలలో సుమారు 20 రోజులపాటు నిరవధిక సమ్మె చేపట్టిన ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. పాలకులు, అధికారులకు సిగ్గు, లజ్జా ఉంటే కార్మికులకు హక్కుగా రావాల్సిన వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పక్షంరోజుల్లో వేతన బకాయిలను చెల్లిస్తామని సంబంధిత కాంట్రాక్టర్ భూటకపు హామీలు ఇచ్చి మోసం చేశాడన్నారు. వెంటనే బకాయి చెల్లించకపోతే ఎన్ని రోజులైనా ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం, కాంట్రాక్టర్లు కుమ్మక్కై కార్మికులు నట్టేట ముంచుతున్నారని ఆరోపించారు. పొట్టకూటి కోసం రేయింబవళ్లు చెమటోడ్చి పని చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించకుండా వేధించడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే శ్రీరామిరెడ్డి కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద రామాంజనేయులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

గ్రామీణ సమ్మెను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-పుట్లూరు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం నిర్వహించనున్న కార్మికుల సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఇందులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందన్నారు. ముఖ్యంగా వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపద రవాణా, బ్యాంకులు, ఎల్ఐసి తదితర సంస్థలన్నింటినీ అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పజెబుతోందన్నారు. ఈనేపథ్యంలో కార్పొరేట్ కంపెనీల లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్లను తెరపైకి తీసుకొచ్చిందన్నారు. అయితే రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేసి మరోరూపంలో వాటిని అమలు చేయాలని కుట్ర చేస్తోందన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లులు పార్లమెంటు ముందు పెట్టి కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇచ్చిందన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం మద్దతు ధర చట్టం తీసుకురావాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రైతు రుణమాఫీ చేయాలని, కేరళ తరహాలో రుణ ఉపశమనం కల్పించాలని,ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లు కేటాయించి 200 రోజులకు పెంచి రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పుట్లూరు మండల కార్యదర్శి ఎస్ సూరి ఏపీ రైతు సంఘం కార్యదర్శి వెంకట చౌదరి వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పెద్దయ్య కెవిపిఎస్ కార్యదర్శి నాగభూషణ్ రైతు నాయకుడు భాస్కర్ రెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

పెద్దవడుగూరు : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం చేపట్టనున్న గ్రామీణ బందును జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉపాధి హామీలో రెండు పూటలా పని, ఆన్‌లైన్ మస్టర్ రద్దు చేయాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠం చేయాలని, కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డు ఇచ్చి సాగులో ఉన్న కౌలు రైతులకే నష్టపరిహారం, బీమా సౌకర్యం ఇవ్వాలని, విద్యుత్ బిల్లులను సవరించాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు శివకృష్ణ పాల్గొన్నారు

ఉరవకొండ : నేడు నిర్వహించనున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సిపిఐ ఉరవకొండ, వజ్రకరూరు, కార్యదరుల్శు మల్లికార్జున, తలారి మల్లికార్జున కార్యదర్శి సుల్తాన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బంద్‌ను చేపడుతున్నట్లు తెలిపారు. బంద్‌లో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నార్పల : బంద్‌ను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా నాయకురాలు నాగవేణి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. వాటిని తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి లలితమ్మ, సిపిఐ సీనియర్ నాయకులు నాగరాజు, శ్రీదేవి, మాబు, సంజీవరాయుడు, కుళ్లాయప్ప, ఆటో యూనియన్ నుంచి రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-తాడిపత్రి

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పూర్వ అధ్యక్షులు రఘురామిరెడ్డి డిమాండ్ చేశారు. ఎపి జెఎసి ఈమేరకు గురువారం భోజన విరామంలో నల్లబ్యాడ్జీలు ధరించి పట్టణంలోని నందలపాడు ప్రాథమికోన్నత పాఠశాల ఎదురుగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం ఇపిఎఫ్ ఖాతాలో దాచుకున్న తమ సొమ్ముని తమకు చెల్లించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. అలాగే డిఎ, సరెండర్ లీవ్, 11వ వేతన సవరణ బకాయిలు చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని, పెరిగిన ధరలు మేరకు ఇంటీరియం రిలీఫ్ 30 శాతం ఇవ్వాలని, విద్యారంగానికి శాపంగా మారిన 117 ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు జయచంద్ర, రామాంజనేయులు, సలీం, సుకుమార్, ఉపేంద్ర, లావణ్య, తారకమ్మ, మంజుల, సాయిలీల, దివ్యభారతి, తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాల యంత్రం ప్రారంభం

అనంతపురం : సిఎం జగన్ సహకారంతో నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న హరిశ్చంద్ర ఘాట్‌లో రూ.1.50 కోట్లతో నిర్మించిన గ్యాస్ ఆధారిత పార్థివదేహాల దహన సంస్కారాల యంత్రాన్ని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సిడబ్ల్యుసి ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, జెసిఎస్ కన్వీనర్ జగదీష్, కొత్తూరు అమ్మవారిశాల అధ్యక్షులు మచ్చా నరసింహులు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తికి ఆరునెలల జైలు

పుట్లూరు : చోరీ కేసులో నిందితుడికి ఆరునెలలు జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలం గోపరాజుపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న పెద్దన్న ఇంట్లో బంగారం చోరీ చేసిన ఘటనలో నిందితుడు సుభాష్ చోరీ చేసినట్లు తేలడంతో తాడిపత్రి కోర్టులో జడ్జి ఆరునెలల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పుట్లూరు : తాడిపత్రి మండలం చిన్నపొలమడ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం రాత్రి చింతకుంట క్రాస్ వద్ద పట్టుకున్నట్లు తాడిపత్రి మైనింగ్ ఎడికి అప్పగించినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

కోడిపందేల జూదరులు అరెస్టు

శింగనమల : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు శింగనమల మండలం నిదనవాడలో కోడి పందేలు ఆడుతున్న జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు... నిదనవాడలో కోడిపందేలు ఆడుతున్నట్లు పక్కాగా అందిన సమాచారం మేరకు స్పెషల్ బ్రాంచి పోలీసులతో కలిసి వెళ్లి దాడి చేసి ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరితోపాటు కారు, రెండు పందెంకోళ్లు, ఏడు ద్విచక్ర వాహనాలు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

20న వాటర్‌షెడ్ పనులపై సామాజిక తనిఖీ

రాయదుర్గం రూరల్ : మండలంలోని వాటర్‌షెడ్ గ్రామాలైన డి.కొండాపురం, టి.వీరాపురం, గ్రామదట్ల గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పిఒ శ్రీవిద్య తెలిపారు. 2022 ఫిబ్రవరి 1 నుంచి 2024 జనవరి 31వ తేదీ వరకూ జరిగిన పనులకు సంబంధించి రికార్డుల ను సామాజిక తనిఖీ బృందానికి అప్పగించారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత గ్రామసభ నిర్వహిస్తా రన్నారు.

డ్రైవింగ్‌పై అవగాహన

రాయదుర్గం : రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని మోటారు వాహ నాల తనిఖీ అధికారి కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఎంవిఐ ఎం.విశ్వనాథరెడ్డి డ్రైవింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రహదారి నిబంధనలను తెలిపారు. సమావేశంలో డ్రైవింగ్ లైసెన్సుకు దరఖాస్తు చేసిన వారు, ఇతర సర్టిఫికెట్ల కోసం వచ్చిన వారు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సంస్థ కార్యదర్శి పి.రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గ్రంథాలయానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రంథాలయ పని తీరును, అందుబాటులో ఉన్న పుస్తకకాలు, సౌకర్యాలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.జయరాములు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన బీర పంట

బెలుగుప్ప : ఆరుగాలం కష్టపడి రూ.లక్షలు వెచ్చించి కట్టపందిరిపై సాగు చేసిన బీర పంట బుధవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు పూర్తిగా నేలకొరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని నక్కలపల్లికి చెందిన రైతు శ్రీనివాసరెడ్డి దాదాపు రెండెకరాల పొలంలో సుమారు రూ.5లక్షలు వెచ్చించి కట్ట పందిరిపై బీర పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది. ఈ సమయంలో బుధవారం రాత్రి వేసిన ఈదురుగాలులకు పంట మొత్తం నేలకొరిగిందని బాధజత రైతు వాపోయాడు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

పలువురు వైసిపిలో చేరిక

ఉరవకొండ : మండలంలోని నెరిమెట్ల గ్రామానికి చెందిన కురుబ రామకృష్ణ, కురుబ చిన్న పర్వతరెడ్డి, కౌడికి ఆనంద్, చేజాల యువరాజు, కురుబ వన్నప్ప, కౌడికి భీమలింగ, కురుబ రమేష్, కురుబ హొన్నూరుస్వామి, కురుబ ఉలితప్ప, మారుగొండ పర్వతరెడ్డి తదితరులు గురువారం వైసిపిలో చేరారు. ఈమేరకు అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి నివాసంలో కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నెరిమెట్ల సర్పంచి యోగేంద్రరెడ్డి, నాయకులు కురుబ అయ్యప్ప, హనుమంతు, చేజాల హొన్నూరుస్వామి, పర్వతప్ప, మరేగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు పంపిణీ

తాడపత్రి రూరల్ : మండల పరిధిలోని గన్నేవారిపల్లి పంచాయతీ పరిధిలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. పట్టణ పరిధిలోని దాదాపు 1084 మంది లబ్ధిదారులకు రూ.122 కోట్లతో నిర్మించిన టిడ్కో ఇళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. త్వరలోనే రూ.1.20 కోట్లతో జగనన్న మార్టు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన

ఉరవకొండ : మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న మోపిడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు రక్తహీనత నివారణపై హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలను వాడాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరుబయట తిరిగేటప్పుడు చెప్పులు ధరించాలని, చేతులను తరచూ శుభ్రం చేసుకుంటూ ఉండాలని, బహిరంగ మలవిసర్జన చేయకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఎఎన్ఎం అనూషా, సీఓ భగవాన్‌దాస్, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మరువకొమ్మ అవినీతిపై నేటి నుంచి ప్రజల్లోకి..

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మరువ కొమ్మ అవినీతిపై ప్రజలకు వివరించడానికి శుక్రవారం నుంచి ప్రజల్లోకి వెళ్లనున్నట్లు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి తెలిపారు. గురువారం గురువారం అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరాభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు తెచ్చావో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ నిధులతో ఏవో నాలుగు రోడ్లు వేస్తే అదే అభివృద్ధి అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యంగా 20 రోజులుగా నగరంలో ప్రజలు తీవ్రమైన నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. అలాగే టిడిపి హయాంలో మరువకొమ్మ మురికి కాలువ ఆధునీకరణకు రూ.18.50 కోట్ల నిధులు విడుదల చేయించి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించామన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంబంధిత టెండర్లను రద్దు చేసి మరో కాంట్రాక్టర్‌తో పని ప్రారంభించారన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి కేవలం మూడుచోట్ల కల్వర్టులు నిర్మించడం అన్యాయమన్నారు. కాలువలో జరుగుతున్న అభివృద్ధిపై జనంలోకి వెళ్లి వివరించనున్నట్లు తెలిపారు. మరో రెండు నెలల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, చంద్రబాబు సిఎం కాగానే నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీతోపాటు, డంపింగ్ యార్డ్ తరలించి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

యువతే దేశానికి భవిష్యత్తు : గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

వివేకానందకు నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు

యువతే దేశానికి భవిష్యత్తు అని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్కెయు సౌజన్యంతో నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో 'యువ సంవత్- ఇండియా ఏ 2047' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నిరంగాల్లో యువత ముందంజలో ఉండాలన్నారు. యువత తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదనన్నరు.ఎస్కెయు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.మురళీధర్ రావు మాట్లాడుతూ యువత స్వామి వివేకానందని స్ఫూర్తి తీసుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన యువ సంవాద్ ఇండియా ఏ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంకె.దేవకీమణి, కరస్పాండెంట్ పిఎల్ఎన్.రెడ్డి, సెక్రటరీ డాక్టర్ నిర్మలమ్మ, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్, యు ఎన్ డిస్టిక్ యూత్ ఆఫీసర్ నేషనల్ యూత్ అవార్డు గ్రహీత బిసాటి భరత్, నేషనల్ ఐకాన్ రాజశేఖర్, సాయిట్రస్టు అధినేత సాయినాథ్, అధ్యాపకులు ఎన్.ఓబిరెడ్డి, ఫిరోజా, రైపర్ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ నాగశోభ, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ విష్ణుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా సీవీ.రంగారెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన సీవీ.రంగారెడ్డి నియమితులయ్యారు. వైసిపి సీనియర్ నాయకుడైన సీవీ.రంగారెడ్డి పార్టీలో చురుగ్గా పనిచేస్తుండడంతో పార్టీ కేంద్రం జిల్లా ఉపాధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సివి.రంగారెడ్డి మాట్లాడుతూ తనకిచ్చిన బాధ్యతతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి భారీ మెజార్టీతో గెలిచేందుకు అహర్నిశలు పాటు పడతానన్నారు. సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, సీనియర్ నాయకులు బి.శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు క్రషర్ మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్లు నదీముల్లా ఫారూఖ్, వి.వరదరాజులు, నాయకులు వై. రామసుబ్బారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, అరటిపండ్ల చంద్ర, రంగస్వామి, ఇబ్రహీం, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

గేట్స్ అటానమస్ పరీక్ష ఫలితాలు విడుదల

గుత్తి : గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల అటానమస్ అనంతరం బీటెక్ మొదటి బ్యాచ్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం స్థానిక కళాశాలలో జెఎన్‌టియు ప్రొఫెసర్ కె.జయలక్ష్మి విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శాంతి ప్రకటించారు. గతంలో పరీక్ష ఫలితాలను జెఎన్‌టియు యూనివర్సిటీ వెల్లడించేది. గేట్స్ అటానమస్ కావడంతో బాధ్యత తమదేనని కళాశాల యాజమాన్యం ప్రకటించింది. ఈ సందర్భంగా గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ 15 రోజుల్లో ఎగ్జామ్ పేపర్ ఇవాల్యుయేట్ చేసి ఫలితాలు వెల్లడించడం గర్వకారణమన్నారు. కళాశాల విద్యార్థులు 60.74 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ వికె.శ్రీవాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, అకౌంట్స్ అధికారి ఇంతియాజ్ బాషా, విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సిద్ధం' సభను విజయవంతం చేయాలి

ఆత్మకూరు : సిఎం జగన్ ఈనెల 18న రాప్తాడులో నిర్వహించనున్న సిద్ధం బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ సభకు మండల వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీ ఎత్తున వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతపురం కలెక్టరేట్ : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక కార్యాలయంలో డ్వామా పీడీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందిన గుంతకల్లు మండలం గురబాడు గ్రామపంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ వీరాంజనేయులుకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. అంతేగాకుండా ఆయన భార్యకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నాయకులు బి.నరసింహులు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్‌కు సన్మానం

అనంతపురం : రాష్ట్ర ఉర్దూ అకాడమిక్ ఛైర్మన్ నదీమ్ అహ్మద్‌ను ప్రభుత్వ ఖాజీగా నియమితులైన శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన షేక్షావలి గురువారం నదీమ్ నివాసంలో ఘనంగా సన్మానించారు. వీరితోపాటు శింగనమల జడ్పిటిసి భర్త భాస్కర్‌ని వైసిపి నాయకులు మొహెబ్ అక్తర్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం

'ఆసరా'లో నాయకులు

ప్రజాశక్తి కళ్యాణదుర్గం

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య

మహిళల అభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. గురువారం కందుకూరు మండలంలో ఏర్పాటు చేసిన ఆసరా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మహిళలకు పెద్దపీట వేశారన్నారు. ఇందులో భాగంగా 0 వడ్డీ రుణాలు విరివిగా అందజేశారని గుర్తు చేశారు. టిడిపి పాలనలో మహిళలకు రుణాలు, సబ్సిడీ రుణాలు, వడ్డీలేని రుణాలు అందలేదన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రతి ఇంటింటా సంక్షేమ పథకాలు చేరాయన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ, జిల్లా అధ్యక్షులు పైల నరసింహయ్య, నాయకులు బాబురెడ్డి, గోవిందు, జడ్పిటిసి నాగరాజు పాల్గొన్నారు.

శింగనమల : మహిళలు ఆర్థికంగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన నాడే అన్నిరంగాల్లో ముందంజ వేయగలుగుతారని భావించిన సిఎం జగన్ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో 'వైఎస్ఆర్ ఆసరా' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సిఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ సిఎం చేయలేని సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో కూడా సిఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం రూ.5.45 కోట్లు చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీలమ్మ, నాయకులు నాగవర్ధన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, బంగారు అలిబాషా, ఎంపిడిఒ రమణ, ఎపిఎం నారాయణస్వామి, చెన్నకేశవులు, ఎన్‌వి.నారాయణ, మహిళ సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : మహిళా సాధికారతే లక్ష్యంగా సిఎం జగన్ పాలన చేస్తున్నారని నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో గురువారం డిఆర్‌డిఎ ఐకెపి ఆధ్వర్యంలో నాల్గో విడత ఆసరా పథకం ద్వారా మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మెట్టు గోవిందరెడ్డి, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి హాజరయ్యారు. మెట్టు మాట్లాడుతూ మహిళల అభివృద్ధిలో ఎపి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సిఎం జగన్ పారదర్శ కంగా పేదల ఖాతాల్లో నగదు బదిలీ చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా నిత్యం ప్రభు త్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. మండల వ్యాప్తంగా 718 మహిళా సంఘా లకు చెందిన 7,039 సభ్యుల ఖాతాల్లోకి రూ. 5.09 కోట్లు జమ చేశామన్నారు. మెగా చెక్కును ఎమ్మెల్యే కాపుతో పాటు మెట్టు సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి పవిత్రవనూరు స్వామి, సర్పంచి హరిజన లక్ష్మి, జడ్పిటిసి హసీనాబాను, వైసిపి మండల కన్వీనర్ వన్నూరుస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, నాయకులు తొండి వెంకటేష్, జగదీష్, రహంతుల్లా, హనుమంతరెడ్డి, శివారెడ్డి, సూరిస్వామి, అన్ని శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అనంతపురం : పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని హంపీ హాస్టల్ వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలయినంత ఎక్కువ మొక్కలు పెంచి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, టి.బాలనరసయ్య, కె.మాధవి, ఎం.రామశేఖరరెడ్డి, దిలీప్‌కుమార్, స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి, వి.సి పి.ఎ సునీల్, శివశంకర్‌గౌడ్, విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి సింగిల్‌విండో డైరెక్టర్ ప్రసాద్

ఉరవకొండ : సింగిల్‌విండో డైరెక్టర్, ఉరవకొండ వైసిపి పట్టణ కమిటీ సభ్యులు బాళ్ల ప్రసాద్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకత్వ లోపాలను వ్యతిరేకించి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎఐసిసి సభ్యులు, మాజీమంత్రి ఎన్.రఘువీరారెడ్డి ప్రసాద్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేసి రానున్న ఎన్నికలలో గెలుపునకు కృషి చేయాలని రఘువీరారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సోనియా సీన, కార్యదర్శి ఇంద్రావతి ఓబులేసు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామానాయుడు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రేగాటి చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

పలువురు జనసేనలో చేరిక

ఉరవకొండ : జనసేన నాయకులు చాబాల నరేంద్ర ఆధ్వర్యంలో దాదాపు 70 మంది యువకులు జనసేన పార్టీలో చేరారు. ఈమేరకు గురువారం పార్టీలోకి చేరిన వారికి నియోజవర్గ ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్ జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, వజ్రకరూరు మండలాల అధ్యక్షులు చంద్రశేఖర్, ఆచనాల కేశవ, నాయకులు రాజేష్, హరిశంకర్‌నాయక్, సూర్యానాయక్, మణికుమార్, సోము, వంశీ, మనోహర్, భీమేష్, మహేష్, హరున్, రాజేష్, హరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

17న రాష్ట్రస్థాయి సైన్స్ కళాయాత్ర రాక

ప్రజాశక్తి-అనంతపురం కల్చరల్

పోస్టర్లను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

ఈనెల 17న జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి సైన్స్ కళాయాత్ర అనంతపురానికి రానున్నట్లు జెవివి నగర అధ్యక్షులు రామిరెడ్డి, మ్యాజిక్ షో జిల్లా కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. గురువారం నగరంలోని కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.శంకరయ్య ఇందుకు సంబంధించిన ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 5న శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభమైన యాత్ర 17న అనంతకు చేరుకుంటుందన్నారు. ఇందులో భాగంగా ఆరోజు కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో కళా ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎస్కెయు రిజిస్ట్రార్ ఎం.వి.లక్ష్మయ్య, ఐఎంఎ జిల్లా కార్యదర్శి డాక్టర్ అభిషేక్‌రెడ్డి, జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్, రాష్ట్రస్థాయి కళాయాత్ర కన్వీనర్ త్రిమూర్తులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, ఐక్యూస్ కో-ఆర్డినేటర్ పర్వీన్, కామర్స్ అధ్యాపకులు ఆదినారాయణ, ఎం.ధనలక్ష్మి, జెవివి నగర నాయకులు సాకే లక్ష్మీనారాయణ, నూర్‌మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జెసి ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన మూడవ విడత యువచైతన్య యాత్ర మూడవ రోజు గురువారం మండలంలోని చీమలవాగుపల్లి, జోడి ధర్మాపురం, వెంగంపేట, నరసాపురం, పెండేకల్లు గ్రామాల్లో సాగింది. ఆయా గ్రామాల్లో టిడిపి, జనసేన శ్రేణులు, జెసి అభిమనులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. చీమలవాగుపల్లిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా ప్రజలకు ఆప్యాయంగా పలకరిస్తూ జెసి ముందుకు సాగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుంటుపడిన రాష్ట్ర అభివృద్ధి మళ్లీ గాడిన పడాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, పెండేకల్లు భాస్కర్‌రెడ్డి, చీమలవాగుపల్లి సత్యనారాయణరెడ్డి, నరసాపురం భాస్కర్‌రెడ్డి, కుమ్మెత హరి, చాగల్లు శంకర, తురకపల్లి సంజీవరెడ్డి, యువ నాయకులు లోకనాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలతో మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి

టిడిపి టికెట్ రేసులో ఉన్నాం..

సీనియర్ నాయకులు డాక్టర్ కె.మునిరత్నం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విలేకరులతో మాట్లాడుతున్న కె.మునిరత్నం

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి రేసులో బలిజ సామాజిక వర్గం నుంచి తాను ఉన్నానని సాయి మహేశ్వర ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయుడు కే.మునిరత్నం అన్నారు. గురువారం టవర్‌క్లాక్ సమీపంలో సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గాఇకి సంబంధించి టిడిపి అధిస్టానం ఇంకా ఎవరికి టికెట్ ఖరారు చేయలేదన్నారు. టిడిపి, జనసేనప పొత్తులో ఉన్నందున ఖరారు కాలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మాత్రం ఇక్కడ పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే త్యాగం చేయడానికి సిద్ధం అంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అతనికే టికెట్ ఇవ్వనప్పుడు త్యాగాలు సూత్రాలెందుకో తెలియడం లేదన్నారు. టిడిపిలో బలిజలు జెండా మోస్తూ అనేక త్యాగాలు చేస్తూ పార్టీ అధికారమే పరమదిగా పని చేస్తు వచ్చామన్నారు. 2024 ఎన్నికల్లో బలిజలకు టికెట్ ఇవ్వాలనే ఆకాంక్షను బలిజ సోదరులందరూ అధిష్టానానికి విజ్ఞప్తులు చేస్తున్నారని తెలిపారు. అధినేత చంద్రబాబు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కూడా కలిసి విన్నవించామన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మీడియా సమావేశాల్లో విరుద్ధమైన ప్రకటనలతో పార్టీకి నష్టం కలిగిస్తోందన్నారు. 2019 ఎన్నికల్లో కూడా తాను రేసులో ఉన్నానని తెలిపారు. ఇప్పుడు కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను ఉన్నానని తెలిపారు. బలిజ నేతలు మాట్లాడుతూ టిడిపి టికెట్ బలిజలకు ఎవరికి ఇచ్చినా తాము గెలిపించుకుంటామన్నారు.